# మీనాక్షీ హౌసింగ్ సొసైటీ

ఆ కాలనీ ఏర్పడినప్పటినుండీ ఒకప్లాటయినా ఖాలీ లేకుండా అందరూ ఇళ్ళుకట్టుకుని, గృహప్రవేశం చేశారు. పైకి చూడటానికి అన్ని ఇళ్లూ ఒక్క మాదిరిగా కనబడతాయి. కాని లోపల గదులూ వాటివసతులూ, వంటయిళ్లూ వాటి సౌకర్యాలూ, స్నానాలగదులూ, వాటి అమరికలూ కొన్ని ఇళ్ళకు ప్రత్యేకంగా ఉన్నాయి. అన్ని ఇళ్ళకూ రెండు పడకగదులు విధిగా ఉన్నా అన్నీ రెండువందల గజాల ప్లాట్లు.

వచ్చీరావటంతోనే పూలచెట్లతో వాకిళ్లూ, కూరగాయాలూ చెట్లపాదులతో పెరళ్లూ శోభాయమానం చేశారు గృహిణులు. పార్కు ఆకారం ఏర్పడకముందే పిల్లలు ఆడుకోవటం మొదలుపెట్టారు.

ఆకాలనీ నిర్మాణం కావటానికి రెండు సంవత్సరాలకు పూర్వం పినాకపాణి తన ఇరుగుపొరుగులతో మాటల సందర్భంలో "ఈ అద్దె ఇళ్ళల్లోపడే అగచాట్ల కంటె అప్పయినాచేసి ఒక స్వంత ఇల్లుకట్టుకుంటే రిటైరయిన తరువాత పెన్షన్‌తో నిశ్చింతగా బతకవచ్చు. అప్పటికి పిల్లలు పెద్దవాళ్ళవుతారు'' అన్నాడు.

"ఇల్లంటే అప్పుచేసి కట్టవచ్చుగాని స్థలాలు దొరకటం చాలాకష్టంగా ఉందంటున్నారు. ఊరిమధ్య స్థలాలు వేలసంఖ్యలో గజం అమ్ముతున్నారని వింటున్నాము. మనమధ్య తరగతి ఏమయిపోవాలి?" అన్నాడొక మిత్రుడు.

''ఊరిమధ్య ఇల్లు కట్టుకోవాలని మనవంటివాళ్ళు అనుకోకూడదు. మనం కూడా ఇళ్ళు కట్టుకోవటానికి మార్గాలులేకపోలేదు ప్రతిఊరూ మొదట ఉన్నట్టే ఇప్పుడుందా? ఊళ్ళు పెరిగిపోతున్నాయి. ఈ ఊరూ పెరుగుతున్నది ఒకపక్క నుంచి. ఆ విధంగా నాలుగు పక్కలనుంచీ పెరిగే అవకాశాలున్నాయి."

"ఊరిబయట ఇల్లుకట్టుకుంటే బతగ్గలమా? పిలిస్తే పలికే దిక్కుండదు.

అగ్గిపెట్టెకావాలన్నా కూరగాయలు కొనాలన్నా పిల్లలు స్కూళ్ళకు పోవాలన్నా అన్నింటికీ ఇబ్బందే."

ఒకరిద్దరిని అభ్యంతరాలు చెప్పనిచ్చి, పినాకపాణి సర్దుకుని కూర్చొని, వివరంగా చెప్పటం మొదలుపెట్టాడు.

"ఒకరూ ఇద్దరూ ఇళ్ళు కట్టుకోవటంకాదు. ఇరవై పాతికమందిచేరి ఒక హౌసింగ్ సొసైటీని స్థాపించుకుని ముందు సభ్యులు అవాలి. దానికి సభ్యత్వం రుసుము నిర్ణయించుకుని సభ్యులైన తరువాత, ఆ సొసైటీకి కార్యదర్శినీ అధ్యక్షుడునీ కోశాధికారినీ వాళ్ళలో వాళ్ళు ఎన్నుకుని, ఆ సొసైటీని రిజిస్టరు చెయ్యాలి. ఆసొసైటీ పక్షాన సభ్యులు ఇద్దరు ముగ్గురు బయలుదేరి మనకెంత భూమి కావాలో నిర్ణయించుకొని అంతా ఒక్కచోట దొరికేటట్టుగా వెతకాలి. ఆ భూమికొని సొసైటీ పేర ముందు రిజిస్టరుచేసి తరువాత ప్లాట్లుగా చేసి ఇళ్ళు కట్టుకోవాలి. సొసైటీ ద్వారా దరఖాస్తుపెట్టుకుంటే ఇల్లుకట్టుకోవడానికి గవర్నమెంటు కోపరేటివ్‌సొసైటీ అప్పులిస్తుంది. వాయిదాల పద్ధతిలో నెలనెల ఇంత మొత్తం చెల్లించాలన్న నియమాలు ఉంటాయి. అవి సక్రమంగా చెల్లిస్తే గడువు కాలంలో తీరిపోతుంది. ముందు సభ్యులు కావాలి" అన్నాడు పినాకపాణి. అందరికీ ఆశపుట్టింది.

ఒకవారం రోజులలోపల ఇరవైమంది సభ్యులు చేర్తామంటూ పినాకపాణి దగ్గర కొచ్చారు. అందరినీ "ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు మాయింటికి రండి. వివరాలు మాట్లాడుకుందా''మని చెప్పాడు పినాకపాణి

ఆదివారం అప్పటికి నాలుగురోజులుంది. ఈ లోపల కోపరేటివ్ సొసైటీల రిజిస్ట్రారును కలుసుకుని సొసైటీని ఏర్పాటుచేయటం, దాని నియమావళి మొదలైన వివరాలు తెలుసుకుని వచ్చాడు పినాకపాణి.

అనుకున్నట్టుగా ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు పినాకపాణి ఇంట్లో ఇరవైమంది సమావేశమయ్యారు. అతడు అందరికీ హౌసింగ్‌కోపరేటివ్ సొసైటీ యొక్క నియమనిబంధనలన్నీ వివరించి చెప్పి ''ఇరవైమంది సభ్యులతో ప్రస్తుతానికి సొసైటీని స్థాపించి దీనిని విజయవంతం చేయాలన్న సంకల్పం తన కున్నదనీ, ఇది పూర్తి అయితే ఈ సొసైటీనే వృద్ధిచేయవచ్చనీ, అందరినీ తమ

తమ అభిప్రాయాలను వెలిబుచ్చ వలసిందనీ కోరాడు అన్ని అంశాలమీద.

అందుకు సులభంగా అందరూ ఆమోదించారు.

''సొసైటీలో సభ్యులుగా చేరటానికి ఏభయిరూపాయలు చెల్లించాలి" అన్నాడు పినాకపాణి.

"అంత ఎందుకు?" ఒకరిద్దరు ఈ ప్రశ్నను లేవదీశారు.

"సభ్యులు రుసుము చెల్లించినట్టుగా రసీదులు ఇవ్వటానికి రసీదు పుస్తకాలు అచ్చువేయించాలి. ఒక సంస్థకు కావలసిన హంగులన్నీ ఏర్పరచాలి. ప్రతిదానికీ డబ్బు అవసరమని అందరికీ తెలిసిన సంగతేగా?"

సణుగుతూ గొణుగుతూ కొందరూ, ''సభ్యులం కావాలంటే చెల్లించాలిమరి'' అని కొందరూ మొత్తమ్మీద అందరూ ఆమోదించి రుసుము చెల్లించారు.

తరువాత అధ్యక్షుడు, కారదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారుల ఎన్నిక జరగాలన్నాడు పినాకపాణి.

అందరూ ఆవాడవాళ్ళే కనుక-ప్రభుత్వాధికార సంపత్తిగలవారు అధ్యక్షులుగా ఉండాలని ఫైనాన్సుడిపార్టుమెంటు అసిస్టెంటు సెక్రెటరీగా పనిచేస్తున్న సదాశివ రావును అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదక్షతా పట్టుదలగల వాళ్ళు ప్రధానకార్యదర్శిగాను ఆయనకు సహాయంగా ఉండటానికీ సభ్యులు బాగా ఆలోచించి "పినాకపాణిగారి హృదయతరంగం ఈ సొసైటీ. ఆయన కార్యదక్షతా దీక్షగల సమర్థుడు. ఆయనను ప్రధాన కార్యదర్శిగా ఉండాలని కోరుతున్నా''మని చప్పట్లుకొట్టారు. ఆ తరువాత సహాయకార్యదర్శిగా జ్వాలాముఖి గారినీ ప్రస్తుతానికి కోశాధ్యక్షుడిగా పినాకపాణిగారే ఉండాలని అందరూ కోరారు.

''మరి- సభ్యులందరికీ నాదొక మనవి. ఈ సొసైటీకి మా అమ్మగారిపేరు మీనాక్షమ్మ కనుక మీనాక్షి హవుసింగ్ సొసైటీ అని పేరుపెడదామని ఉంది. అమ్మవారి పేరు కనుక ఎవరికీ అభ్యంతరం ఉండదనుకుంటాను'' అన్నాడు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయిన పినాకపాణి.

"మాకేమభ్యంతరంలేదు. అమ్మవారంటే శక్తిస్వరూపిణి. తలుచుకున్నపని చేసి తీరుతుంది" అంటూ అందరూ ఆమోదించారు.

ఆనాటికి అందరూ ఇళ్ళు కట్టుకున్నట్టే సంతోషంగా విడిపోయారు.

ఆనాటినుండీ సొసైటీకి ఏకఖండంగా ఉన్న స్థలంకోసం ప్రధానకార్యదర్శి సహాయకార్యదర్శి తిరగటం మొదలు పెట్టారు. పినాకపాణి స్కూటరుమీద. అంతలో అధ్యక్షుల దగ్గరనుంచి కబురువచ్చింది. ఒకసారి తనను కలుసుకొమ్మని. పినాకపాణి వెళ్ళేసరికి అధ్యక్షులు "మా ఆఫీసువాళ్ళు నలుగురు, స్నేహితులు కొందరు-అంతాకలిసి పదిమంది సభ్యులమవుతా మంటున్నారు. ఇది వాళ్ళ పేర్ల లిస్టు అంతా కలిసి ముప్ఫైమంది అనుకోండి.''

ఆయన అధ్యక్షుడేకాక ప్రభుత్వ పరపతి గలవాడన్న గౌరవంతో సరేనని ఒక రిజిస్టరుకొని సభ్యుల పేర్లన్నీ వ్రాశాడు పినాకపాణి.

మొట్టమొదటి సమావేశంలో, జరిగిన విషయాలను కార్యవర్గం పేర్లనూ సభ్యులసంఖ్యనూ నిర్ణయమయినతీర్మానాలనూ మినిట్సు ఒక రిజిస్టరులో వ్రాశాడు. మరొక రిజిస్టరులో జమా ఖర్చులను వ్రాశాడు. వెంటనే సభ్యులకు రసీదులు ఇవ్వటానికి రసీదుల పుస్తకాలను రెండింటికి ప్రెస్సులో ఆర్డరు చేశాడు.

పినాకపాణి సాయంత్రం ఐదుగంటలకు ఆఫీసునుంచి వచ్చి, ఆరుగంటల నుంచీ ఎనిమిది గంటలవరకు తన ఇంట్లోనే ముందరవైపుగదిలో ఆఫీసు పెట్టాడు. దానికి సంబంధించిన కాగితాలూ పుస్తకాలు ఒక బీరువాలో పెట్టి తాళంవేశాడు. పెట్టిన గడువులో సభ్యులు ఒక్కొక్కరే వచ్చి రుసుము చెల్లించి రసీదులు తీసుకుని వెళ్ళుతున్నారు.

అధ్యక్షుడు సదాశివరావుతో కూడా వెళ్ళి, పినాకపాణి మీనాక్షి కోపరేటివ్ హౌసింగ్ సొసైటీని రిజిస్టరుచేయించాడు.

రెండవ సమావేశంలో కిందటి సమావేశపు మినిట్సు చదివి వినిపించాడు పినాకపాణి. అధ్యక్షులసంతకం తీసుకున్నాడు. మిగతా సభ్యులు ఆమోదించి నట్టుగా ఒక్కొక్కరే సంతకాలు పెట్టారు. జమా ఖర్చులు కూడా సభ్యులువిన్నారు. ఆ సమావేశంలో సభ్యుడికి 200 గజాలవంతున ప్లాట్లు చేయాలనీ, అందుకు ఆరువేల గజాల స్థలం ఇళ్ళకోసమూ, ఒకవెయ్యిగజాలస్థలము ఆఫీసు, రీడింగ్ రూమ్. సభ్యులందరూ సమావేశం కావటానికి ఒక హాలుకట్టి, మిగతా స్థలం పార్కు

చెయ్యటానికి మొత్తం ఏడువేలగజాల స్థలం కావాలని నిశ్చయించుకున్నారు. నిర్ణయించిన విషయాలను మినిట్స్‌బుక్‌లోకి ఎక్కించాడు కార్యదర్శి.

పినాకపాణి జ్వాలాముఖి ఇద్దరూ ఎంత తిరిగినా వాళ్ళనుకున్నట్టుగా స్థలం దొరకలేదు. ఊరి పొలిమేరలదాపున ఆరుఎకరాల స్థలం ఉందనీ, దాని యజమాని ఆ దరిదాపులలో ఉంటాడనీ ఎవ్రడసుతో కూడా ఒక ఆయన హోటల్లో కలిసి పినాకపాణికి చెప్పి ఒక మనిషిని వాళ్ళవెంట పంపించాడు. ముందుగా స్థలం చూస్తే బాగుందనుకొని యజమాని దగ్గరికి వెళ్ళారు.

పినాకపాణి తమ సొసైటీకి స్థలం కావాలని వచ్చినట్టుగా చెప్పాడు. స్థలం చూశాననీ తనకూ వచ్చిందని కూడా ముందుగానే అన్నాడు.

"మా వాడు ఫ్యాక్టరీ పెట్టాలనుకుంటున్నాడు. అందుకే విదేశాలకు కూడా వెళ్లాడు అక్కడివి చూసిరావటానికి. ఇంకా ఒకరిద్దరూ కూడా స్థలం కావాలని వచ్చారు. మీకు కావలసింది ఎంత?"

"ఏడువేల గజాలు. ముప్పైమంది మెంబర్లున్నారు."

"మా పిల్లలను అడిగి వస్తాను. నా భార్యనుకూడా అడగాలి" అంటూ లోపలికి వెళ్ళాడు అందరితో సంప్రతింపులు జరిపి ఒక గంట తరువాత వచ్చి, అందరూ అంతగా ఇష్టపడటంలేదు. పెద్దమనుష్యులతో వ్యవహారమని నేనే బాధ్యత తీసుకుని చెప్తున్నాను. గజం పదిహేను రూపాయలు" అన్నాడు గంభీరంగా.

''నట్టడవిలో స్థలానికి గజం పదిహేనురూపాయలా? మన సభ్యులందరు మధ్యతరగతివాళ్ళు. ప్రతి చిన్నవస్తువు కోసం ఊళ్ళోకి వెళ్లాలి. పిల్లల స్కూళ్లకూ ఇబ్బందే. అయినప్పటికి సొసైటీద్వారా స్వంతఇళ్ళు కట్టుకోవాలనుకుంటారు. మీరు చెప్పిన ధర పెట్టలేరు."

"అయితే ఎంత ఇవ్వగలుగుతారు?"

"ఐదురూపాయలయితే ఇవ్వగలుగుతారు."

"పదికాదు-పన్నెండు కాదు అయిదు రూపాయలకా? కుదరదండి"

బేరం రెండుగంటలసేపు జరిగింది. చివరికి ఎనిమిది రూపాయలకు బేరం కుదిరింది.

"నాదొకషరతు. మీరు కచ్చితంగా రెండురోజులలో డబ్బంతా ఇక్కడే ఇచ్చివెయ్యాలి. ఐదు రూపాయలకుగజం వంతున రిజిస్టరు చేయించుకోవాలి. డబ్బు చేతిలోపడగానే రిజిస్టరుచేస్తాను మీ సొసైటీపేరున" అన్నాడు యజమాని.

పినాకపాణి ఆలోచించాడు - 'సమతలమైన స్థలం ఏకఖండంగా ఉంది. మొదటబెట్టుచేసినా ఎనిమిదిరూపాయలకు దిగాడు. కాని ఐదురూపాయలకు రిజిస్టరు చేస్తానంటున్నాడు. సొసైటీ వ్యవహారం. అందరికీ తనమీద విశ్వాసముండాలి' అనుకుని "మా సొసైటీ మెంబర్లకుకూడా ఈ సంగతిచెప్పి అధ్యక్షుడిని తీసుకువచ్చి స్థలం చూపిస్తాను"అని జ్వాలాముఖితో వచ్చేశాడు.

సభ్యులు ఈ మాటవినగానే "అబ్బో అంతధరా? అదీ ఊరి బయట? అక్కడ ఇల్లుకట్టుకుని మనముండగలమా? భూమి కేఅంత పెట్టితే ఇల్లేంకట్టగలము?" అంటూ సగంమంది వెనకడుగువేశారు.

అధ్యక్షులేమంటారోనని సందేహించాడు పినాకపాణి. కాని అధ్యక్షుడు స్థలం చూసిన తరువాత "సమతలమైన స్థలం. ఏకఖండంగా మనకు లభించటం చాలా కష్టం. ఎనిమిది రూపాయలకే భయపడి వెనకడుగువేస్తే ఇది కాస్తాపోతుంది. మళ్ళీ మనకిటువంటి అవకాశం లభించదు. నాకునచ్చింది" అన్నాడు. ఆ మాటే సభ్యుల కందరికీ చెప్పాడు.

"స్థలానికి ఎనిమిది రూపాయలు. కరెంటు, డ్రైనేజి, నీళ్ళు మన సొసైటీ దగ్గరికి రావటానికి కొంతడబ్బు, పార్కు వేసి మిగతా ఆఫీసు రీడింగ్‌రూమ్ హాలు అంటున్నారు. వాటికిఅయ్యేఖర్చు మనకు తడిసి మోపెడుకాదా?" సభ్యులలో పదిమందికిపైగా గొణిగారు.

పినాకపాణికి గొంతుపట్టుకున్నట్టుగా ఉంది. ఈ అవకాశంపోతే మళ్ళీరాదు. అధ్యక్షుడుకూడా తీసుకుందామంటున్నాడు. స్థలం యజమాని డబ్బు త్వరగా అందజేయ మంటున్నాడు.

ఎట్లాగయితేనేం - అధ్యక్షులూ ఇతర సభ్యులూ బలవంతమ్మీద డబ్బు కట్టారు. అది యజమానికిఇచ్చి రసీదు తీసుకుని అధ్యక్షుడూ పినాకపాణి రిజిస్టరు మీనాక్షి కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరుమీద చేయించారు.

ఎనిమిది రూపాయలు చెల్లించి ఐదురూపాయలకు రిజిస్టరు చేయటమేమిటని మళ్ళీ సభ్యులు గొడవచేశారు.

"అతడికి రిజిస్ట్రేషను ఖర్చెక్కువవుతుందని అలా చేశాడుగాని మనకేం నష్టములేదు" సర్దిచెప్పారు పినాకపాణీ అధ్యక్షుడూను.

ఆ స్థలం 200 గజాల వంతున ముప్ఫయిప్లాట్లు చుట్టూచేసి, మధ్యగాఉన్న స్థలం సొసైటీకి వదలిపెట్టారు. ప్రతిసభ్యుడికీ విడివిడిగా రిజిస్ట్రేషను చెయ్యటం కూడా అయింది. రిజిస్ట్రేషను అయేటప్పుడు ముందుప్లాట్లు మాకు కావాలంటే మాకుకావాలని కొందరు పేచీపెట్టారు. కరెంటు, డ్రైనేజి నీటివసతి ముందు ఉన్నప్లాట్లకు తక్కువధర పడుతుంది. చివరిప్లాట్లవాళ్ళకు ఎక్కువవుతుంది. దానికి మళ్ళీ సభ్యులు గొడవచేశారు. అప్పుడు సొసైటీ సభ్యులు సమావేశమయి, ముందు అటు ఎనిమిది ఇటు ఎనిమిదీ ప్లాట్లకు అధికంగా డబ్బు ఇవ్వవలసి ఉంటుందని తీర్మానంచేశారు. వాళ్ళు ఇవ్వక తప్పలేదు.

సణుగుళ్ళూ గొణుగుళ్ళూ చిన్న చిన్న తగాదాలు ఎన్నో పొటమరించాయి. మళ్ళీ రెండోనాటికి సమసిపోతూవచ్చేవి. ఎందుకంటే స్వంతఇల్లు కట్టుకునేటప్పుడు ఇవి సాధారణంగా వస్తూనేఉంటాయని ఎవరోఒకరు సర్దిచెప్తూ ఉండేవారు.

కొందరు ఈ సొసైటీద్వారా కోపరేటివ్ సొసైటీలో అప్పుతీసుకున్నారు. కొందరు వాళ్ళ ప్రావిడెంటుఫండులోనుంచి తీసుకుని ఇళ్ళుకట్టడము ప్రారంభించారు. మొత్తంమీద ఇళ్ళన్నీ ఏడాదిలోపల తయారయ్యాయి. పార్కు మ్యునిసిపాలిటీ చుట్టూతిరిగి అధ్యక్షుడి పరపతిని ఉపయోగించివేశారు. ఇంక ఆఫీసు, సమావేశం హాలు అప్పుచేసికట్టారు. సభ్యులంతా నెలకు చందాలిచ్చినట్టు ఇచ్చి అప్పుతీర్చారు. సమావేశంజరుపుకునే హాలునే రీడింగ్‌రూముచేశారు. చందాలు వసూలుచేసి పేపర్లు తెప్పించుకుంటున్నారు.

ఇప్పుడు మీనాక్షి కోపరేటివ్ హౌసింగ్‌సొసైటీచుట్టూ ఇళ్ళూ, మధ్యలో పార్కు రెండువైపులా దీపాలూ, పూలచెట్లూ ఎంతోఅందంగాఉంది. స్వంతఇళ్ళను చూసి సభ్యులు మురిసిపోతున్నారు. సాయంత్రవువేళల్లో పిల్లలూ, పెద్దలూ పార్కుకువెళ్ళి కూర్చుంటారు. అందరికీ చాలా తృప్తికరంగా సంతోషదాయకంగా ఉంది.

ఏడాదికొకసారి ఎలక్షను జరిపించినా కార్యవర్గ సభ్యులు మారుతున్నారు గాని అధ్యక్షులు ప్రధానకార్యదర్శి సహాయకార్యదర్శులు తిరిగి తిరిగి వారే ఎన్నికవుతున్నారు.

ఆరుసంవత్సరాలు గడిచిపొయ్యాయి ఆనందంగా.

ఒకనాడు మీనాక్షి కోపరేటివ్ హౌసింగ్‌సొసైటీ కార్యదర్శి పేరున ఒక లాయరునోటీసు వచ్చింది. "సయ్యద్ మహమ్మదలీగారి కుమారుడైన ఖాశీంఖాన్ గారి స్థలం ఏడువేల చదరపుగజాలస్థల. అక్రమదారులద్వారా ఖరీదుచేసి రిజిస్టరు చేయించుకున్నందుకుగాను స్థలం వారిది వారికి అప్పగించి ఇంతకాలంగా మీరు ఉపయోగించుకున్నందుకు నాలుగులక్షల రూపాయలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. లేదా ఆ ఏడువేల గజాలస్థలానికి ఇప్పటి మార్కెటురేటు చెల్లించవలసింది. ఒక నెలలోగా ఈ వ్యవహారం పరిష్కరింపబడాలి" అని.

పినాకపాణి జ్వాలాముఖిగార్లు దాంతో భయపడిపోయి అధ్యక్షుడి దగ్గరికి వెళ్ళారు. ఆయనకూ ఏటూతోచక లాయరుదగ్గరికి వెళ్ళారు ముగ్గురూకలిసి.

లాయరు కాగితాలన్నీ జాగ్రత్తగా పరిశీలనచేసిచూశాడు. డాక్యుమెంట్లన్నీ సరిగానేఉన్నాయి. రిజిస్ట్రేషనుకూడా అందరిసంతకాలతో ఉండవలసినవిధంగా ఉంది.

కొంతసేపటికి లాయరు అన్నాడు. ఇక్కడ చాలా కుటుంబాలలో అనేక మంది వారసులుంటారు. ఆ వారసులెవరో ఎక్కడుంటారో ఎవరికీ తెలియదు. కాని ఇటువంటి అమ్మకాలు జరిగినప్పుడు బయటికివస్తారు. అందుకే ఒక నెల రోజుల నోటీసు - పత్రికలలో ప్రకటిస్తారు - "వారసులెవరైనాఉంటే నెలలోపున ఈ అడ్రసుకు తెలపవలసిందని" అమ్మకందారుడు ఈ పనిచేయాలి. లేక మీరయినాచేసి ఉండచ్చు. ఇప్పుడు మీరుకూడా మీ రిజిస్ట్రేషను నెం. తో కూడా ఫలానా ఆయన దగ్గర కొన్నట్టుగా లాయరునోటీసు ఇవ్వండి! అని సలహా యిచ్చాడు. అధ్యక్షుడి అంగీకారంతో ఆ లాయరుచేతనే ఒక నోటీసు ఇప్పించి ఇళ్ళకు వచ్చారు ముగ్గురు.

ఆ రాత్రి పినాకపాణికి నిద్రపట్టలేదు. తనెంతకష్టపడ్డాడు ఈ సొసైటీ కోసం? ఎంతమందిచేత మాటలుపడ్డాడు? సభ్యులకందరికీ తనమీద అనుమానమే

ఎంత స్వంతఖర్చు సొసైటీ పేరుమీద చేస్తున్నాడోనని. తనను మాటలనటానికి అందరికీ అధికారం ఉందన్నట్టుగా ప్రవర్తించారు. తనకు నిజంగా దక్కింది స్వంత యిల్లంటూ ఒకటి ఏర్పడ్డదన్నమాటేగాని ఎంతచాకిరిచేశాడు? కన్న తండ్రిలా సొసైటీమీద మమకారం పెంచుకున్నాడు పైగా.

ఈ సంగతివిని సభ్యులంతా భయపడుతూ ఆయన దగ్గరికివచ్చి "అంత తెలుసుకోకుండా ఎట్లా కొన్నావయ్యా స్థలాన్ని?" అంటూ అరిచారు.

"మీకేంభయంలేదు నష్టంకలిగితే అందరికీ కలుగుతుంది. కాని అటువంటిది జరగదు సొసైటీవైపునకూడా లాయరునోటీసు యిచ్చాము" అని నచ్చచెప్పాడు.

తరువాత మెల్లగా తెలిసింది-అసలు స్థలం డబ్బు గజానికి ౨ రూ. వంతున చెల్లించింది. అమ్మిన అతడికీ ఆపైనఇచ్చిన (౭ రూ గజంవంతున) ది బ్రోకరుకనీ పంపకాలయ్యాయని ఆ బ్రోకరు ఈ విధంగా ఎవరినో ఒకరిని కలుపుకుని ఇటువంటి పనులు చేస్తునేఉంటాడనీను. కాని అతడు ఎక్కడా పట్టుబడలేదు. ఆ కేసు తేలలేదు.

అలాగే మీనాక్షి కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ కేసుకూడా పదేళ్ళు కావచ్చింది. ఎటూతేలలేదు. ఇంకా నోటీసులమీద నోటీసులు వస్తునేఉన్నాయి. సొసైటీకూడా జవాబు నోటీసు లిస్తునేఉన్నది.

"ఇంకా రెండేళ్ళు ఇట్లాగేగడిస్తే పన్నెండేళ్ళవుతుంది. పన్నెండేళ్ళు మన స్వాధీనంలోఉంటే మనదే అయిపోతుంది" అన్నాడు అధ్యక్షుడు.

సభ్యులంతా ఆ ధైర్యంమీదనేఉన్నారు. కాని-అంతలోకీ మరో రెండు నోటీసులు అందాయి ఆ స్థలంమాదని.

ఇంకా ఈ సంగతి అందరికీ తెలియలేదు. తెలిస్తే ఎంత బాధపడతారు? 'నాటికొక్క దైవములేడే?' అన్న ధైర్యంతోఉన్నారు కమిటీసభ్యులూ అధ్యక్షులూ పినాకపాణీ.